క్లుప్తంగా

పరిశోధనల్లో ముందుండాలి

సంగారెడ్డి టౌన్: విద్యార్థులు పరిశోధనల్లో ముందుండాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. సంగారెడ్డి మండల పరిధిలోని హనుమాన్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జిల్లాస్థాయి సృజన టెక్ ఫెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలలో ముందుండాలని వివిధ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు రగ్గుల పంపిణీ

జోగిపేట(అందోల్): జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన నిద్రిస్తున్న పేదలకు రగ్గులను లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ అనంతరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. జీఎస్టీ కోఆర్డినేటర్ నరసింహారాజు ఇచ్చిన బ్లాంకెట్ ఛాలెంజ్ పిలుపుతో లయన్స్ క్లబ్ సభ్యుడు విఠల్‌రావు థాండ్లే సహకారంతో రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోగిపేట పట్టణంలో చలికి వణికిపోతూ నిద్రిస్తున్న పేదలను గుర్తించి 20 మందికి రగ్గులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ రాంబాబు, క్లబ్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సభ్యుడు సంతోష్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

హత్నూర(సంగారెడ్డి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమించిన నాయకులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ మండల కమిటీ నాయకులు గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా తెలంగాణ ఉద్యమంలో రోడ్డుపై వచ్చి ఆందోళనలు చేశామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తమను ఆదుకొని ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

నారాయణఖేడ్: మండల పరిధిలోని నర్సాపూర్ మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం యూత్‌ఫర్‌సేవ, ఎన్‌టీటీ డాటా సాఫ్ట్‌వేర్ సంస్థల డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్ సౌజన్యంతో 100మంది విద్యార్థులకు నోటుబుక్స్, జామెట్రీబాక్సులు, బ్యాగులు, పెన్స్, పెన్సిళ్లు అందజేశారు. విద్యాసామగ్రిని పంపిణీ చేసినందుకు గాను ఉపాధ్యాయులు, విద్యార్థులు తిప్పరాజు ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి

మునిపల్లి(అందోల్): యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి అన్నారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఓపన్ టూఆల్ వాలీబాల్ పోటీలను సర్పంచ్ అంజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, గ్రామపెద్దలు వెంకటలక్ష్మారెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. అంతకుముందు ఆయా టీం సభ్యులతో కలిసి సర్పంచ్ అంజిరెడ్డి టాస్ వేశారు. నిర్వాహకులు నర్సింహులు, రాములు, ఆయా టీం సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

కల్హేర్(నారాయణఖేడ్): భూమి కొలతలు చేసేందుకు వెళ్లిన ప్రభుత్వ సర్వేయర్ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట మండలంలోని మునిగేపల్లి శివారులో సర్వే నంబర్ 258లో భూమి సర్వే చేసి సరిహద్దులు చూపేందుకు ఇటీవల డివిజనల్ కార్యాలయంలో రైతు రిజ్వాన్ ఆహ్మద్ దరఖాస్తు చేశారు. ఈ మేరకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ కొనగంటి కృష్ణ ఈ నెల 20న సాయంత్రం సర్వే చేస్తున్న క్రమంలో నిజాంపేటకు చెందిన బేతి దుర్గయ్య, గోబుల పాపయ్య, మరో మహిళ కలిసి అడ్డుకొని సర్వేయర్‌ను నీ సంగతి చూస్తాం.. చంపేస్తామని బెదిరించారు. సర్వేయర్ కొనగంటి కృష్ణా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిన్నారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాటా సుధా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ లావణ్య, నాయకులు నరేష్, నరేందర్‌గౌడ్, శ్రీదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. సాయినగర్ కాలనీ, శాంతినగర్ కాలనీ, మార్కెట్‌లో గురువారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు

ఉల్లాసం.. ఉత్సాహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులకు కూచిపూడి నృత్య అకాడమీ వ్యవస్థాపకురాలు శాంతంగారి షణ్ముఖి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కూచిపూడి నృత్యంలో శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూచిపూడి నృత్యంపై తమ అకాడమీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కలలు అంతరించిపోకుండా తమ కళా సంస్థ తరపున కృషి చేస్తున్నామని తెలిపారు. అనేక ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.



నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అంబరాన్నంటిన క్రిస్మస్ వేడుకలు

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని శివాజీ ఆడిటోరియంలో గురువారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల గంటలు, నక్షత్రాలతో అలకరించిన ఆడిటోరియం పండుగ శోభను సంతరించుకుంది. పండుగ వాతావరణంలో విద్యార్థులు ఆలపించిన పాటలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. మానవాళి కోసం ఏసుక్రీస్తు జననం, త్యాగాన్ని చిత్రీకరిస్తూ, ఒక ఆంగ్ల నాటకాన్ని ప్రదర్శించి క్రిస్మస్ ప్రాముఖ్యతను చాటిచెప్పారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి

క్రిస్మస్ క్యాలెండర్ ఆవిష్కరణ

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వేణుపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రకాశ్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభుకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగుతో జనం బేజారు

- దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- మురుగునీటిని తొలగించాలని విన్నపం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వెళ్లే మార్గంలోని తెల్లాపూర్ ముఖద్వారం వద్ద కొన్ని రోజులుగా రోడ్డుపై డ్రైనేజీ నీరు చేరడంతో ప్రజలు రోడ్డును ఆనుకోని ఉన్న వ్యాపారస్తులు మురుగునీటితో దుర్వాసనతో నరకయాతన పడుతున్నారు. నల్లగండ్ల పరిధిలోని పలు కాలనీలకు చెందిన డ్రైనేజీ నీరు కొంతకాలంగా తెల్లాపూర్‌లోని వనం చెరువులోకి చేరుతోంది. కాగా కొంతకాలం క్రితం గత ప్రభుత్వం ఈ మార్గంలో రేడియల్ రోడ్డును అభివృద్ధి చేసింది. దీంతో రేడియల్ రోడ్డును ఆనుకొని వర్షపు నీరు వెళ్లేందుకు కాలువను నిర్మించారు. అయితే ప్రస్తుతం ఆ కాలువలో మురుగునీరు ప్రవహిస్తోంది. అదేవిధంగా గతంలో రోడ్డు ఆనుకొని ఖాళీ స్థలాలు ఉండేవి. దీంతో మురుగునీరు ఆ ఖాళీ స్థలాల నుంచి చెరువులోకి చేరేవి. ప్రస్తుతం అందులో నిర్మాణాలు చేపట్టడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



రోడ్డుపై చేరిన మురుగునీరు



అధికారుల తీరుపై ఆగ్రహం

రోడ్డుపైకి మురుగునీరు రావడానికి కారణం ఎవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు అభివృద్ధి చేసినప్పుడు రోడ్డు పక్కన నిర్మించిన కాలువ మూసివేయడం వల్లనే ఈ సమస్య తలెత్తుతోందని స్థానికులు అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు వర్షంనీరు వెళ్లే కాలువను ఎందుకు పూర్తి చేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతాలకు చెందిన మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



కొన్ని రోజులుగా రోడ్డుపైకి మురుగునీరు వచ్చి చేరుతోంది. దీంతో మా వ్యాపారాలు కూడా సరిగా జరగడంలేదు. నిత్యం అధికారులు ఈ మార్గంలో రాకపోకల సాగిస్తున్నా సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు.

– రవీందర్‌రెడ్డి, వ్యాపారి, తెల్లాపూర్

మురుగును తొలగించాలి



తెల్లాపూర్ ముఖద్వారం వద్ద మరుగునీరు ఉండడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. బ్యాంకు ముందు మురుగునీరు నిలవడంతో బ్యాంకులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– నాగరాజ్‌గౌడ్, ప్రైవేట్ ఉద్యోగి

ఆటోడ్రైవర్ల ఆందోళన

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తాలో ఆటో కార్మికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందలాది మంది ఆటోలు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా తమ బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్లకు బతుకుదెరువు చూపించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్ల సంఘం బీఆర్‌ఎస్‌కేవీ మండల యూనియన్ అధ్యక్షుడు భట్టు మారుతిరాజు, దౌల్తాబాద్ ఆటో యూనియన్ అధ్యక్షుడు కృష్ణగౌడ్, సీఐటీయూ జిల్లా నాయకులు శేఖర్, లక్ష్మారెడ్డి, ప్రవీణ్‌మార్, నర్సింహులు, యాదగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు, యూనియన్ నాయకులు

జాతర ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని గణపతిగూడెం గ్రామంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న రేణుకాఎల్లమ్మ తల్లి జాతర ఆహ్వాన పత్రికను గురువారం ఆవిష్కరించారు. సర్పంచ్ జగన్, ఎంపీటీసీ మమత, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడికి రిమాండ్

జోగిపేట(అందోల్): మైనర్ బాలికను ప్రేమిస్తున్నానంటూ నమ్మించి అత్యాచారం చేసిన వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు. తాండూర్ సమీపంలోని కుస్‌చారమ్‌కు చెందిన పవన్ ఓ బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి మూడు నెలల క్రితం ఆ బాలికను తీసుకెళ్లి, అత్యాచారం చేసి వదిలేసి పారిపోయాడు. దీంతో బాలిక కుటుంబీకులు ఆగస్టులో జోగిపేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పవన్ ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులకు తాండూర్ వద్ద ఉన్నాడన్న సమాచారం మేరకు జోగిపేట పోలీసులు అతన్ని అదుపులోని తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జహీరాబాద్: పట్టణంలోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చిలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో డీఎస్ జాన్ విల్సన్‌తో పాటు కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమాలను తిలకించేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీబీఎస్ బస్ స్టేషన్ నుంచి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు వరకు బస్ సౌకర్యం కల్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి తెల్లాపూర్‌కు సిటీబస్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి ఈ నెల 25నుంచి ఉదయం 6 గంటల నుంచి సీబీఎస్ నుంచి కొల్లూరుకు ప్రతి 45 నిమిషాలకు బస్సు కేటాయించినట్లు తెలిపారు.

ఎంపీలను సస్పెండ్ చేయటం తగదు

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష ఎంపీల హక్కులను కాలరాస్తూ పార్లమెంట్ భద్రతపై చర్చ జరగాలని పట్టుబట్టిన ఎంపీలను సస్పెండ్ చేయడం సరైందికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. గురువారం నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సంప్రదాయాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. ఈనెల 22న దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసనలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహరెడ్డి, నాయకులు పాండురంగారెడ్డి, వాజీద్ అలీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెచ్చగొడితే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

నారాయణఖేడ్: కార్మికులను రెచ్చగొట్టి సమ్మె చేయించేందుకు యత్నించేవారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో ప్రకారమే గత మే 1వ తేదీ నుంచి ఇద్దరు ఉద్యోగులకు రూ.1000చొప్పున వేతనాలను పెంచినట్లు తెలిపారు. కొందరు సీఐటీయూ నాయకులు కార్మికులను రెచ్చగొట్టి తప్పుదోవపట్టిస్తూ సమ్మె చేయించేందుకు యత్నిస్తున్నారన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నేటి నుంచి ఉత్సవాలు

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ శివారులోని వెంకటాచల దివ్యక్షేత్రం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చన్నారు. శుక్రవారం రాత్రి భజనతో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ప్రారంభంకానున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 4గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, 5గంటలకు ఉత్తర వైకుంఠ ద్వారా ఆరాధన పల్లకీసేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.



కొలువైన వేంకటేశ్వరుడు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

వన్‌వేగా తహసీల్దార్ రోడ్డు మార్పు

జహీరాబాద్: పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను తీర్చేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం ట్రాఫిక్‌ను నియంత్రించారు. ప్రజలకు 65వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతూవచ్చారు. ఎట్టకేలకు కొత్త ప్రభుత్వ పాలనలో ట్రాఫిక్ సమస్యలు తీర్చేందుకు పోలీసులు ముందుకురావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయం రహదారిపై వెళ్లేందుకు ట్రాఫిక్ అధికంగా ఉంటున్నందునా వన్ వే రోడ్డుగా మార్పు చేశారు. సింధు టిఫిన్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వెళ్లే రహదారిపై వన్‌వే కొనసాగునుంది. ఇదే రహదారిపై తహసీల్దార్ కార్యాలయం నుంచి సింధు టిఫిన్ సెంటర్ వెళ్లేందుకు వీలుగా పక్కనే ఉన్న వేంకటేశ్వర షాపింగ్‌మాల్ రహదారి నుంచి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్ ఆటోస్టాండ్, భవానీ మందిర్‌రోడ్డు, కుమార్ హోటల్ జంక్షన్ ప్రాంతాల్లో సాఫీగా వెళ్లేందుకు వీలుగా ట్రాఫిక్ కానిస్టేలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ ఇబ్బందులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎట్టకేలకు పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టడం ద్వారా ఇబ్బందులు తప్పుతాయని పట్టణ ప్రజలు అంటున్నారు. బ్లాక్ రోడ్డును కూడా వన్‌వేగా మార్చాలని పలువురు కోరుతున్నారు.



వన్‌వే రోడ్డు కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

పరిమితికి మించి కంకర తరలింపు



అధిక లోడుతో కంకర తీసుకెళ్తున్న టిప్పర్

సంగారెడ్డి అర్బన్: పట్టణ కేంద్రంలో అధిక లోడుతో కంకర తరలిస్తున్నారు. టిప్పర్ లారీలలో పరిమితికి మించి లోడ్ ఎక్కువ ఉన్నప్పటికీ టార్పాలిన్ ఏర్పాటు చేయడంలేదు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి మల్కాపూర్ చౌరస్తాలో, ఎంఎన్ఆర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వైపునకు పరిమితికి మించి కంకరను అధిక లోడ్‌తో తరలిస్తున్నారు. పరిమితికి మించి కంకర పైకి ఉండటం ద్వారా స్పీడ్‌బ్రేకర్ల వద్ద సడన్ బ్రేకులు వేసినప్పుడు కంకర జారీ రోడ్డుపైన పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని వాహనదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పనులు సరే.. హెచ్చరిక బోర్డులేవీ?

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రం నుంచి జహీరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి పనులు కృష్ణాపూర్ గ్రామ శివారులో ప్రారంభమయ్యాయి. ఒకవైపు రోడ్డును పూర్తిగా తవ్వేసి రోడ్డు పక్కన సైడ్ బర్మ్‌గా మట్టిని వేసి చదును చేశారు. రోడ్డు తవ్వేసిన ప్రాంతంలో సూచికంగా కనీసం ఎటువంటి బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులకు అయోమయానికి లోనవుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



సూచిక బోర్డులు లేకుండా కొనసాగుతున్న పనులు

రేపు ఖేడ్‌లో గీతాయజ్ఞం

నారాయణఖేడ్: ఖేడ్ షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి, గీతాజయంతిని పురస్కరించుకొని లోక కల్యాణార్థం గీతాయజ్ఞం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖేడ్ రామమందిరంలో ఉత్తరద్వార పూజామహోత్సవం, ఉత్తర ద్వారంగుండా రామచంద్రులవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఇస్నాపూర్ మల్లికార్జున్‌నగర్ కాలనీకి చెందిన శంకర్ స్క్రాప్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 10 గంటలకు భార్య రోహిత భర్తకు ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. మరుసటి రోజు గురువారం తెల్లవారుజామున ఇంటికి వస్తుండగా రుద్రారం గ్రామ శివారులోని హోటల్ సమీపంలోని యూటర్న్ వద్ద శంకర్ బుల్లెట్ బండిని వెనకాల నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన శంకర్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.